
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 22 । ఆగస్టు । 2023



## రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో నిత్యాన్నదాన భవనానికి వేల్పూరు మురళీ సురేష్, భువనేశ్వరి దంపతులు సోమవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



## డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు.

## బెస్ట్ టీచర్లు.. కదలాలి ఫాస్ట్‌గా..



రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2023కు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, డైట్, సాంఘిక, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఈ అవార్డుకు అర్హులు. - 8లో▸

## న్యూస్‌రీల్

### పోలీసు 'జగనన్నకు చెబుదాం'కు 21 అర్జీలు



ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ బాషా

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 21 అర్జీలు వచ్చాయి. అర్జీదారులు ఇచ్చిన ఫిర్యాదులను ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్ ఖాదర్ బాషా పరిశీలించారు. అమలాపురం కె.అగ్రహారానికి చెందిన ఓ మహిళ తనను భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. అలాగే సంఘ తీర్మానాలకు వ్యతిరేకంగా ఓ వ్యక్తి నిర్ణయాలు చేస్తున్నాడంటూ మండపేటకు చెందిన రాష్ట్ర ఐక్య కాపునాడు ప్రతినిధి వాదా ప్రసాదరావు ఫిర్యాదు చేశారు. ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలు పేరుతో తాను రూ.1.03 లక్షలకు మోసపోయానని అమలాపురానికి చెందిన ఓ ఎలక్ట్రానిక్ గృహోపయోగ వస్తువుల షోరూమ్ వ్యాపారి ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్‌లో ఓ ఎలక్ట్రానిక్ సంస్థ కొనుగోళ్ల ఆర్డరు తీసుకుని పత్తా లేకుండా పోయిందని పేర్కొన్నారు.

### మండపేటలో 28న మెగా జాబ్ మేళా

అమలాపురం రూరల్: రామచంద్రపురం, మండపేట పరిధిలోని నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఈ నెల 28న మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ మేళాలో 12 సంస్థలు పాల్గొంటున్నాయని, 950 ఉద్యోగాలు భర్తీ చేస్తారని వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, జిల్లా ఉపాధి కల్పనాధికారి వి.వసంతలక్ష్మి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) లోకమాన్, ఏడీఎస్‌డీఓ నాగబాబు, వికాస మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. జాబ్ మేళాకు సంబంధించి స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ వినోద్‌ను 80991 83854, చక్రధర్‌రెడ్డిని 96031 61039 నంబర్లలో సంప్రదించవచ్చు.

### నిత్యాన్నదాన భవనం నిర్మాణానికి విరాళాలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో నిర్మిస్తున్న నిత్యాన్నదాన భవనం నిర్మాణానికి సోమవారం పలువురు దాతలు విరాళాలు సమర్పించారు. వి.కామరాజు,అనంతలక్ష్మి దంపతులు (కపిలేశ్వరపురం మండలం వల్లూరు) రూ.13,009, జి.రామకృష్ణ, మునిశాంతి దంపతులు (రాజమహేంద్రవరం) రూ.11,011, కె.చైతన్యరామ్ (కాకినాడ) రూ.10,116, ఎస్.వెంకన్నబాబు, దివ్య దంపతులు (కొయ్యలగూడెం మండలం పరింపూడి) **రూ.10,007 చొప్పున విరాళాలు అందించారు. దాతలకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటాలు అందజేశారు.**

### జగనన్న కాలనీలో అభివృద్ధి పనుల పరిశీలన



సామర్లకోట జగనన్న లే అవుట్‌లో పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ ఎండీ లక్ష్మీశ, దవులూరి దొరబాబు, జేసీ ఇలక్కియ

సామర్లకోట: స్థానిక ఈటీసీ లే అవుట్‌లోని జగనన్న కాలనీలో అభివృద్ధి పనులను ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుతో కలసి ఆ సంస్థ ఎండీ జి.లక్ష్మీశ సోమవారం పరిశీలించారు. ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు ఇక్కడ పనులు చేయిస్తున్నారు. వీటిని లక్ష్మీశ పరిశీలించి, హౌసింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు రంగులు వేసే విధంగా చూడాలన్నారు. కాలనీలో డ్రైన్ల నిర్మాణం వేగవంతం చేయాలని, తద్వారా ముంపు సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు సూచించారు. పనుల పురోగతిపై హౌసింగ్ పీడీ సుధాకర్ పట్నాయక్, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ కె.ప్రసాద్‌రాజు, హౌసింగ్ డీఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

# లెక్క తేలింది

- వరదలతో 1,567 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం
- అత్యధికంగా 965 హెక్టార్లలో దెబ్బతిన్న కూరగాయ తోటలు
- తుది అంచనాలు సిద్ధం చేసిన ఉద్యాన శాఖ
- జిల్లాలో నష్టపోయిన రైతులు 5,077 మంది
- అందనున్న పరిహారం రూ.2.95 కోట్లు



ఈ నెల 8న జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల పర్యటన సందర్భంగా రైతులను పంటనష్టం వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమలాపురం/కొత్తపేట: గోదావరి వరదలు జిల్లాలోని ఉద్యాన పంటలకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. గత నెలలో వచ్చిన వరదలకు జిల్లాలోని లంక గ్రామాల్లో ఉద్యాన పంటలు అధిక విస్తీర్ణంలో దెబ్బ తిన్నాయి. పంట నష్టంపై ఉద్యాన శాఖ అధికారులు తుది అంచనాలు సిద్ధం చేశారు. వీటి ఆధారంగా ప్రభుత్వం నష్టపరిహారం అందించనుంది.

గత నెలలో గోదావరికి కాస్త భారీగానే వరదలు వచ్చాయి. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిలో వరద ప్రవహించింది. ఈ వరదలకు జిల్లాలోని గోదావరి లంక గ్రామాల్లో అరటి, కూరగాయలు, బొప్పాయి, తమలపాకు పంటలకు అధికంగా నష్టం వాటిల్లింది. పెరుగుతూ.. తగ్గుతూ పది రోజులకు పైగా గోదావరి వరద ఉధృతి కొనసాగింది. ఫలితంగా లంక గ్రామాల్లోని తోటల్లో రోజుల తరబడి వరద నీరు నిలిచిపోయి, ఆయా పంటలకు అంచనాలకు మించి నష్టం వాటిల్లింది. అత్యధికంగా పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి, ముమ్మిడివరం మండలాల్లో పంటలు ఎక్కువగా దెబ్బ తిన్నాయి. అయినవిల్లి మండలం ముక్తేశ్వరం, వీరవల్లిపాలెం; కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంక; పి.గన్నవరం మండలం జి.పెదపూడిలంక, ఊడుమూడి లంకల్లో కూరగాయల సాగు అధికం. ఇక్కడ పచ్చిమిర్చి, బెండ, వంగ, మునగతో పాటు, దొండ, బీర, ఆనప, పొట్ల వంటి పందిరి కూరగాయల సాగు అధికంగా జరుగుతోంది. అలాగే, ఆలమూరు, రావులపాలెం, ఆత్రేయపురం తదితర మండలాల్లో కూడా రైతులు కూరగాయల పంటు సాగు చేస్తున్నారు.

వరదలకు జిల్లా వ్యాప్తంగా సుమారు **1,566.613 హెక్టార్లు (సుమారు 3,869 ఎకరాల్లో)** ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. అత్యధికంగా కూరగాయ పంటలకు 965.323 హెక్టార్లలో నష్టం జరిగింది. తరువాత అరటి 523.984 హెక్టార్లు, బొప్పాయి 59.834 హెక్టార్లు, తమలపాకు పంట 14.784 హెక్టార్లలో దెబ్బ తింది. మొత్తం అన్ని పంటలకూ సంబంధించి 32,453 మెట్రిక్ టన్నుల దిగుబడికి నష్టం జరిగింది. వరదల సమయంలోనే ప్రాథమిక అంచనా వేసిన అధికారులు ఇప్పుడు మరింత పక్కాగా పంట నష్టం అంచనాలు రూపొందించారు.

**సీఎం ఆదేశాలతో..**

గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించారు. ఈ నెల 8వ తేదీన ముమ్మిడివరం, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో సీఎం జగన్ పర్యటించిన విషయం తెలిసిందే. వరదలతో దెబ్బ తిన్న కూరగాయల పంటలు, అరటి తోటలను ఆయన స్వయంగా పరిశీలించి, రైతులతో మాట్లాడారు. వరదల ప్రభావంతో తాము ఎంతో నష్టపోయామని, తమను ఆదుకోవాలని ఆ సమయంలో పలువురు ఉద్యాన పంటల రైతులు సీఎంకు మొర పెట్టుకున్నారు. వారి ఆవేదన విని స్పందించిన సీఎం జగన్ పది రోజుల్లోగా పంట నష్టపరిహారం అంచనాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అంచనాలు పూర్తి చేసి, నెల రోజుల్లోగా పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటానని రైతులకు భరోసా ఇచ్చారు. సీఎం ఆదేశాల మేరకు నిర్ణీత గడువులోగా అధికారులు పంట నష్టం, పరిహార అంచనాలు రూపొందించారు.



ముమ్మిడివరం మండలం గోగుల్లంకలో వరదలకు దెబ్బతిన్న కూరగాయ పంట (ఫైల్)

**రూ.2.95 కోట్ల పరిహారం**

వరదల వల్ల జిల్లాలో పంట నష్టపోయిన రైతులకు రూ.2,95,98,002 మేర పరిహారం అందనుంది. సుమారు 5,077 మంది రైతులకు ఈ పరిహారం అందించనున్నారు. అత్యధికంగా తమలపాకు తోటలకు హెక్టారుకు రూ.75 వేల చొప్పున, అరటికి రూ.25 వేలు, కూరగాయలు, బొప్పాయి, పసుపు, పువ్వుల తోటలకు హెక్టారుకు రూ.15 వేల చొప్పున పరిహారం ఇవ్వనున్నారు.

**వరద ప్రభావం వల్లే రేట్లు**

రావులపాలెం అరటి మార్కెట్‌లో ధరలు ఆకాశాన్ని అంటడానికి వరదలే ప్రధాన కారణం. కర్పూరం రకం అరటి ధర రికార్డు స్థాయిలో పెరిగిన విషయం తెలిసిందే. వారం క్రితం గరిష్ఠంగా రూ.250 ఉన్న గెల ధర రూ.600కు చేరింది. దీనికి వరదల వల్ల పంట నష్టపోవడమే కారణం. వీటితో పాటు కూరగాయల ధరలు సైతం అమాంతం పెరిగాయి.

**జిల్లాలో ఉద్యాన పంటల నష్టం ఇలా..**

| పంట | నష్టం (హెక్టార్లలో) | నష్టపోయిన రైతులు | హెక్టారుకు పరిహారం | పెట్టుబడి రాయితీ |
|---|---|---|---|---|
| అరటి | 523.984 | 1,455 | 25,000 | 1,30,73,810 |
| కూరగాయలు | 965.323 | 3,437 | 15,000 | 1,44,77,562 |
| బొప్పాయి | 59.834 | 120 | 15,000 | 8,97,510 |
| పసుపు | 1.352 | 3 | 15,000 | 20,280 |
| పూలతోటలు | 1.336 | 7 | 15,000 | 20,040 |
| తమలపాకులు | 14.784 | 55 | 75,000 | 11,08,800 |
| మొత్తం | 1,566.613 | 5,077 | 32,453.04 | 2,95,98,002 |

### ప్రభుత్వానికి నివేదించాం



గోదావరి వరదల వలన ఉద్యాన పంటలకు జరిగిన నష్టాలను కలెక్టర్ హిమాన్షు శుక్లా ద్వారా ప్రభుత్వానికి నివేదించాం. మేం తయారు చేసిన జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ఉంచాం. రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించాం. పంట నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం జరుగుతుంది.

– బీవీ రమణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

## ఐ, బ్లడ్ బ్యాంకులు ప్రారంభం



బ్లడ్, ఐ బ్యాంకులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, కలెక్టర్ శుక్లా, శివరామ సుబ్రహ్మణ్యం

అమలాపురం టౌన్: పట్టణంలోని కాలేజీ రోడ్డులో యెండూరి ఫౌండేషన్ ఆధ్వర్యాన కొత్తగా ఏర్పాటు చేసిన యెండూరి రాఘవ నాగేశ్వరరావు ఐ అండ్ బ్లడ్ బ్యాంకులు సోమవారం ప్రారంభమయ్యాయి. వీటిని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, కలెక్టర్ హిమాన్షు శుక్లా, రాష్ట్ర ఆర్య వైశ్య సంఘం నాయకుడు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ, కళ్లు, రక్తం దానం చేయడం సమాజ హిత కార్యక్రమమని అన్నారు. కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ, కళ్లు, రక్తం దానం చేసే వారు అభినందనీయులన్నారు. శివరామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగి ప్రాణాలు రక్తదానంతో నిలబడితే.. కళ్లు దానం చేస్తే మరణాంతరం ఆ వ్యక్తి నేత్రాలు ఎంతో మంది అంధులకు చూపునిస్తాయని అన్నారు. బ్లడ్, ఐ బ్యాంకులను అందుబాటులోకి తీసుకువచ్చిన రాష్ట్ర ఆర్యవైశ్య ప్రతినిధులు యెండూరి రాఘవ, నాగేశ్వరరావు దంపతులు అభినందనీయులని ముఖ్య అతిథులు కొనియాడారు. ఫౌండేషన్ చైర్మన్, వైస్ చైర్‌పర్సన్ యెండూరి నాగేశ్వరరావు, రాఘవ దంపతులు మాట్లాడుతూ, ఉచిత సేవ చేయాలన్న తలంపుతోనే బ్లడ్, ఐ బ్యాంకులు ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, బాదం బాలకృష్ణ ఐ – బ్లడ్ బ్యాంక్ చైర్మన్ బాదం బాలకృష్ణ, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, ఫౌండేషన్ కోశాధికారి యెండూరి సత్య కార్తీక్ తదితరలు పాల్గొన్నారు.

## గ్రూప్‌-1 విజేతకు ఘన స్వాగతం




డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన భానుప్రకాష్‌రెడ్డిని సత్కరిస్తున్న గ్రామస్తులు

ముమ్మిడివరం: ఏపీపీఎస్సీ గ్రూప్‌–1 ఫలితాల్లో ఐదో ర్యాంకు సాధించి, డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన అనాతవరం సర్పంచ్ మిమ్మితి చిరంజీవి కుమారుడు భానుప్రకాష్‌రెడ్డి సోమవారం తొలిసారిగా స్వగ్రామం వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను తల్లిదండ్రులతో పాటు బంధుమిత్రులు, స్నేహితులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికి, సత్కరించారు. ఐఏఎస్ లక్ష్యంతో తమ కుమారుడు భానుప్రకాష్‌రెడ్డికి ఢిల్లీలో శిక్షణ ఇప్పించామని తండ్రి చిరంజీవి చెప్పారు. గ్రూప్‌–1 ఫలితాల్లో ఐదో ర్యాంకు సాధించడం గర్వకారణంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శంకరరావు, మాజీ సర్పంచ్ పెయ్యల పరశురాముడు తదితరులు భానుప్రకాష్‌రెడ్డిని అభినందించారు.

## గోశాలకు రూ.51 వేల విరాళం



విరాళం అందిస్తున్న మార్వాడీ విష్ణు సమాజం ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీ గౌతమ మహర్షి గో సంరక్షణ సమితి గోశాలలోని ఆవుల మేత నిమిత్తం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన మార్వాడీ విష్ణు సమాజం రూ.51 వేల విరాళం అందించింది. ఈ సమాజానికి చెందిన మార్వాడీలు సోమవారం గోశాలను సందర్శించారు. గో పూజలు, దుర్గా మంత్ర జపం, దుర్గా పారాయణ, భజనలు నిర్వహించారు. రూ.10 వేల విలువైన బెల్లం, తెలగ పిండి, పచ్చిగడ్డి తీసుకుని వచ్చి స్వయంగా ఆవులకు పెట్టారు. సమాజం ప్రతినిధులు దినేష్‌కుమార్ మాలి, శాంతిలాల్ మాలి, దామోదర్ గాంచి, గోశాల ట్రస్ట్ ప్రతినిధులు సుభాష్, ప్రసాద్, విస్సు, స్వామి పాల్గొన్నారు.

## స్పందనకు 225 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 225 మంది నుంచి కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల వారీగా అందిన అర్జీలపై క్షేత్ర స్థాయిలో పూర్తిగా విచారణ చేపట్టాలని సూచించారు. ఫొటోలతో సహా నివేదికలు అప్‌లోడ్ చేస్తూ, గడువులోగా సంతృప్తికర స్థాయిలో పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. స్పందనతో పాటు అమలు చేస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

**బీఎల్‌ఓ యాప్‌లో డేటా ఎంట్రీ పూర్తి చేయాలి**

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా ఇంటింటి సర్వే పూర్తయినందున బీఎల్‌ఓ యాప్‌లో డేటా ఎంట్రీ వెంటనే ప్రారంభించి, సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. జిల్లాలోని తహసీల్దార్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఒకే డోర్ నంబర్‌లో పది మందికి పైబడి ఓటర్లు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 18 నుంచి 20 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువతను, వివిధ కళాశాలల్లో చదువుతున్న వారిని గుర్తించి నూరు శాతం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఖరీఫ్ వరి సాగు తీరుపై కూడా ఆయన సమీక్షించారు.

# జేఎన్‌టీయూకేక

- వర్సిటీగా ఆవిర్భావానికి పదిహేనేళ్లు
- సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో విజయాలు
- న్యాక్‌–ఎ+ హోదాతో పాటు మరెన్నో గుర్తింపులు
- కళాశాలను వర్సిటీగా మార్చిన వైఎస్సార్
- రేపు ఆవిర్భావ దినోత్సవం




బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సుదీర్ఘ చరిత్రను సొంతం చేసుకున్న ప్రతిష్టాత్మక జేఎన్‌టీయూకే కాలానుగుణ మార్పులతో సగర్వంగా ముందడుగు వేస్తోంది. క్వాలిటీ ఎడ్యుకేషన్‌కు చిరునామాగా నిలుస్తోంది. తొలినాళ్లలో అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలగా ఏర్పడి.. తర్వాత విశ్వవిద్యాలయంగా అవతరించింది. విద్యారంగంలో ఆధునిక సంస్కరణలు చేపడుతూ అన్నింటికంటే మిన్నగా తలెత్తుకుంటోంది. ఈ ఉన్నత విద్యాసంస్థ బుధవారం ఆవిర్భావ వేడుకలు జరుపుకొనేందుకు ముస్తాబవుతోంది.

**స్వర్ణయుగం.. వైఎస్సార్ హయాం**

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 1946లో కాకినాడలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటైంది. 1972లో ఏర్పడిన జేఎన్‌టీయూ–హైదరాబాద్‌కు అనుబంధమైంది. విద్యా రంగాన్ని ఉన్నత పథంలో నిలపాలని భావించిన వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాక జేఎన్‌టీయూ కళాశాలకు మంచి రోజులు వచ్చాయి. వాణిజ్య, వ్యాపార పరంగా అభివృద్ధి చెందుతున్న కాకినాడ నగరంలో అన్ని వనరులూ ఉన్నాయని ఆయన గుర్తించారు. దీంతో 2008లో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చుతూ నిర్ణయం తీసుకున్నారు. వనరుల పరంగా పెద్దపీట వేశారు. విభజనకు ముందున్న తూర్పు, పశ్చిమ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని 264 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు జేఎన్‌టీయూకే గొడుగులోకి వచ్చాయి. అనుబంధ కళాశాలలుగా చేరాయి. విజయనగరం, నరసారావుపేట, కాకినాడ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలను కూడా ఈ యూనివర్సిటీకి అనుసంధానం చేశారు. తర్వాత 2021 నుంచి విజయనగరంలోని జేఎన్‌టీయూ పరిధిలోకి ఉత్తరాంధ్ర జిల్లాలు మారిపోయాయి.

**అభివృద్ధి పథం**

కాకినాడ జేఎన్‌టీయూకు డాక్టర్ అల్లం అప్పారావు తొలి ఉపకులపతిగా పని చేశారు. తరువాత డాక్టర్ తులసీరామ్‌దాస్, వీఎస్ఎస్ కుమార్, డాక్టర్ రామలింగరాజు వీసీలుగా బాధ్యతలు నిర్వహించారు. అత్యధిక కాలం రిజిస్ట్రార్‌గా సేవలందించిన డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు 2021 నుంచి వైస్ చాన్సలర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈయన సారథ్యంలో వర్సిటీ పలు మైలురాళ్లను అధిగమించింది. వర్సిటీ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకూ అంటే ఈ పదిహేనేళ్లలో దాదాపు రూ.100 కోట్లకు పైగా వెచ్చించి, వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రతిష్టాత్మక ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఐఈటీలు,స్టూడెంట్ ఎమినిటీ సెంటర్, ఎగ్జామ్స్ సెల్, బాలుర, బాలికల వసతి గృహాల వంటి నిర్మాణాలు చేపట్టారు. వర్సిటీ ఆవరణలో రోడ్లను సైతం చక్కగా నిర్మించారు. కళాశాలగా ఉన్న ప్రాంగణం వర్సిటీగా మారడంతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి.

### ఆధునిక కోర్సులు

- ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ జేఎన్‌టీయూకే కొత్త పుంతలు తొక్కుతోంది. కాలం చెల్లిన పాత కోర్సులనే పట్టుకుని వేళ్లాడకుండా విద్యార్థుల భవితకు ఉపకరించే కోర్సులకు అగ్రాసనం వేస్తోంది. ఈ 15 ఏళ్లలో అనేక కొత్త కోర్సులు ప్రవేశపెట్టారు.
- సంప్రదాయ కోర్సులతో పాటు బీటెక్‌లో పెట్రోలియం ఇంజినీరింగ్, ఫుడ్ టెక్నాలజీ వంటి కోర్సులు ప్రారంభించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పేరుతో డైరెక్టరేట్ ఏర్పాటు చేసి హెల్త్ సేఫ్టీ, నానోటెక్నాలజీ, బయో టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఏవియానిక్స్,మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి కొత్త కోర్సులు నిర్వహిస్తున్నారు.
- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కోర్సును కూడా ఈ ఏడాది ప్రారంభించడం విశేషం. ఫుడ్ టెక్నాలజీ ప్రవేశాల్లో బైపీసీ అభ్యర్థులకు అర్హత కల్పించారు.
- స్వీడన్, యూఎస్, జర్మనీ వంటి విదేశీ వర్సిటీలతో ఇప్పటికే ఒప్పందాలు చేసుకుంది. 45 దేశాల ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతోంది. ఈ ఏడాది న్యాక్‌–ఎ+ గుర్తింపు సాధించింది. దీంతో వర్సిటీ ఖ్యాతి మరింత పెరిగింది.

### వేడుకలకు సన్నాహాలు

**ఎన్నో విజయతీరాల**కు చేరిన జేఎన్‌టీయూకే **బుధవారం ఆవిర్భావ** వేడుక చేసుకునేందుకు **సిద్ధమైంది. వాస్తవాని**కి ఈ నెల 20న నిర్వహించా**ల్సి ఉంది. ఆదివారం** సెలవు కావడంతో ఈ **ఉత్సవం బుధవారం** నిర్వహించేందుకు వర్సిటీ **అధికారులు ఏర్పాట్లు** చేస్తున్నారు. ఈ వేడుకల్లో **ఉన్నత విద్యామండలి** చైర్మన్ హేమచంద్రారెడ్డి **ముఖ్య అతిథిగా పా**ల్గొంటున్నారు. న్యాక్‌–ఎ+, **ఎ++ గుర్తింపు పొం**దిన అనుబంధ కళాశాలల **ప్రతినిధులను ఈ** సందర్భంగా సత్కరించను**న్నారు. సివిల్స్‌లో ప్ర**తిభ చూపిన సి.యశ్వంత్ **రెడ్డిని కూడా సన్మాని**ంచనున్నారు.

### సంస్కరణలకు బాట వేస్తున్న జగన్



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వల్ల వర్సిటీ ఎంతో పురోగతి సాధించింది. ఆయన ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా ఎంతో మంది ఇంజినీరింగ్ పట్టభద్రులై, దేశ విదేశాల్లో అత్యధిక వేతనం పొందుతున్నారు. నేడు గ్రామీణ ప్రాంతంలో సైతం 100 నుంచి 200 మంది ఇంజినీరింగ్ పట్టభద్రులున్నారంటే ఘనత వైఎస్సార్‌దే. ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా విద్యారంగంలో సంస్కరణలు తీసుకువస్తున్నారు. విద్యా ఫలాలు పేదలందరికీ దక్కేలా చూస్తున్నారు.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, వీసీ, జేఎన్‌టీయూకే

**ప్రముఖులకు డాక్టరేట్లు**

2008లో వర్సిటీ ఏర్పడిన తరువాత ఇప్పటి వరకూ తొమ్మిది స్నాతకోత్సవాలు నిర్వహించారు. నేషనల్ మ్యాథమెటీషియన్ సీఆర్ రావు, మెట్రో రైల్ సీఎండీ శ్రీధరన్, పారిశ్రామికవేత్త మస్కేలర్ బాంబే, ఇస్రో డైరెక్టర్ ఎంవైఎస్ ప్రసాద్, డీఆర్‌డీఓ శాస్త్రవేత్త సతీష్ రెడ్డి, సెయిల్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, గ్రీన్‌కో ఫౌండర్ చలమలశెట్టి అనిల్ వంటి ప్రముఖులకు గౌరవ డాక్టరేట్లు అందజేసింది. 2012 నుంచి ఇప్పటి వరకూ యూనివర్సిటీ ద్వారా వివిధ విభాగాల్లో 6.50 లక్షల మంది పట్టాలు పొందారు. 2,100 మందికి పీహెచ్‌డీలు ప్రదానం చేశారు. జేఎన్‌టీయూకే కళాశాలలో ఇంజినీరింగ్ చదవడం నాడూ నేడూ గొప్పగానే భావిస్తారు. భెల్ సీఎండీ శాస్త్రి, శాంతా బయోటెక్ అధినేత వరప్రసాద్‌రెడ్డితో పాటు శ్యామలరావు, కృష్ణబాబు, రవిచంద్ర, ఎస్‌వీ ప్రసాద్ వంటి ఐఏఎస్ అధికారులు ఈ వర్సిటీలో ఇంజినీరింగ్ చదివిన వారే కావడం విశేషం. వీరే కాదు.. మరెందరో ప్రముఖులు ఇక్కడ చదివి ఈ ప్రతిష్టాత్మక విద్యా సంస్థకు గుర్తింపు తెచ్చారు.

## క్లుప్తంగా

### ఒక్క వ్యాన్‌లో ఇన్ని ఆవులా?

నిలదీసిన ఎంపీ మార్గాని భరత్‌రామ్



వ్యాన్ డ్రైవర్‌తో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

నిడదవోలు రూరల్: చిన్న వ్యాన్‌లో ఆరు ఆవులను కుక్కేసి తరలించడంపై రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పురుషోత్తపల్లిలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన వెళుతున్నారు. ఈ క్రమంలో గోపవరం వద్ద ఓ చిన్న వ్యాన్‌లో ఆరు ఆవులను కుక్కి తరలిస్తూండటాన్ని గమనించారు. వెంటనే ఎంపీ ఆ వ్యాన్‌ను నిలిపారు. 'ఇంత చిన్న వ్యాన్‌లో అన్ని ఆవులా? ఎక్కడికి కబేళాకా, గోశాలకా?' అంటూ డ్రైవర్ గోపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకో వాహనం తీసుకువచ్చి ఆవులను సమిశ్రగూడెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆవులు రైతులకు చెందినవిగా నిర్ధారణ చేసుకున్న అనంతరం, వారికి అప్పగించామని ఎస్సై సుభానీ తెలిపారు.

### ఆలయం సమీపాన వ్యక్తి మృతి



త్రినాథ్‌రెడ్డి మృతదేహం

గోకవరం: తూర్పు గోదావరి జిల్లా గోకవరం గుబ్బాలమ్మ ఆలయం సమీపాన సోమవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. ఉదయం మృతుడిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, విచారణ నిర్వహించారు. మృతుడిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం పసలపూడి గ్రామానికి చెందిన తేతలి త్రినాథ్‌రెడ్డి(72)గా గుర్తించారు. అతడు అనారోగ్యంతో మృతి చెందినట్టు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై యూవీ శివనాగబాబు తెలిపారు.

# బెస్ట్ టీచర్లు.. కదలాలి ఫాస్ట్‌గా..

- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం
- ప్రభుత్వం ఉత్తర్వులు
- మార్గదర్శకాల విడుదల



విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

రాయవరం: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు–2023కు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, డైట్, సాంఘిక, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఈ అవార్డుకు అర్హులు. మండల/డివిజన్ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 24వ తేదీ వరకూ గడువు ఇచ్చారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు 25 నుంచి 28వ తేదీ వరకూ.. రాష్ట్ర స్థాయి అవార్డుకు 29 నుంచి 31వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. వచ్చిన దరఖాస్తులను ఆయా స్థాయిల్లోని కమిటీలు పరిశీలి స్తాయి.

**వివిధ స్థాయిల్లో కమిటీలు**

- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు మండల స్థాయిలో ఎంఈఓ చైర్మన్‌గా కమిటీ ఉంటుంది. ఇందులో స్థానిక హెచ్‌ఎం, డైట్ లెక్చరర్/మండలానికి చెందని మరో హెచ్‌ఎం సభ్యులుగా ఉంటారు. ఎంఈఓ పరిధిలోని ప్రాథమిక/ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయుల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో ఒకరిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు వారు పనితీరు ఆధారంగా మార్కులు కేటాయిస్తారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయుల జాబితాను ఎంఈఓలు జిల్లా విద్యాశాఖాధికారి(డీఈఓ)కి అందజేయాల్సి ఉంటుంది.
- డివిజన్ స్థాయిలో డీవైఈఓ చైర్మన్‌గా, మరో ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను ఎంపిక చేయాల్సి ఉంటుంది.
- జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, డీఈఓ కన్వీనర్‌గా, డైట్ ప్రిన్సిపాల్, ప్రముఖ విద్యావేత్త, జిల్లా కలెక్టర్ ఎంపిక చేసిన మరో జిల్లా స్థాయి అధికారితో కూడిన కమిటీ ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తుంది.
- రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు కూడా జిల్లా నుంచి ఎంపిక చేస్తారు.
- అసంపూర్తిగా ఉన్న, ఫొటోలు లేని, ఆలస్యంగా వచ్చే దరఖాస్తులను పరిశీలనలోకి తీసుకోరు.

**ఇవీ మార్గదర్శకాలు**

- రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులు కనీసం 10 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకుని ఉండాలి.
- ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు, డైట్ లెక్చరర్లు, ఎంఈఓలు, ఇతర తనిఖీ అధికారులు అర్హులు కారు. అయితే, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఎటువంటి క్రమశిక్షణా చర్యలు, క్రిమినల్ కేసులు లేని వారు మాత్రమే అర్హులు.
- గతంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది ఉండాలి.
- అర్హులైన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వారి దరఖాస్తులను ఎంఈఓలకు సమర్పించాలి.
- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ప్రతిపాదన చేసే ఉపాధ్యాయులకు సంబంధించి పది లైన్లకు మించకుండా పరిశీలనాధికారి రాయాల్సి ఉంటుంది.
- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు తొమ్మిది కేటగిరీల్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. హైస్కూళ్లలో హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లు; ప్రాథమికోన్నత పాఠశాలలల్లో హెచ్‌ఎం; ప్రైమరీ, యూపీ స్కూళ్లలో ఎస్‌జీటీ; హైస్కూళ్లలో డ్రాయింగ్, క్రాఫ్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్, మ్యూజిక్ టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చు.

**పారదర్శకంగా ఎంపిక**



జిల్లా, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానించాం. వచ్చిన దరఖాస్తుల పరిశీలన అనంతరం పూర్తి పారదర్శకంగా ఎంపిక చేస్తాం. జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుదారుల్లో అన్ని విభాగాల్లోనూ ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తాం.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి

### పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు తొలిపూజ చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం తరఫున అన్నదానం చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. సాయంత్రం పూజల అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలోని ఉప ఆలయాల్లో అర్చకులు పూజాదికాలు నిర్వహించారు.

### సాంకేతిక నైపుణ్యంతో ఉపాధి పనులు



శిక్షణలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: ఉపాధి పథకంలో పనులు మరింత నాణ్యతగా చేపట్టడానికి డ్వామా అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ తెలిపారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఏలూరు, పశ్చిమగోదావరి, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో పని చేస్తున్న డ్వామా పీడీలకు మూడు రోజుల శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డ్వామా అధికారులకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే పనుల గుర్తింపు, అంచనాల తయారీ, మొక్కలు నాటడం, పుస్తకాల నిర్వహణ, మేట్ల పనితీరు, ఉపాధి హామీలో ఇప్పటి వరకూ జరిగిన పనిలో లోపాలను గుర్తించి వాటిని సవరణ చేయడం, సామాజిక తనిఖీ వంటి అంశాలపై శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణ మోహన్, ఫ్యాకల్టీలు ఎంఎస్ఎస్ రెడ్డి, కేఆర్ నిహారిక, వెంకటేశ్వరరావులు శిక్షణ నిర్వహించారు. అదే విధంగా కాకినాడ జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు రెండురోజు శిక్షణ ప్రారంభమైంది.

# ఆగిన బతుకు నాట్యం

- బతుకుతెరువుకు వచ్చి అనంతలోకాలకు..
- తిరుమలాయపాలెం వద్ద బైక్‌ను ఢీకొన్న వ్యాన్
- ఇద్దరు వీరభద్ర నృత్యకారుల దుర్మరణం
- మృతులు సామర్లకోట వాసులు
- నాట్య ప్రదర్శనకు వెళ్లి వస్తూండగా దుర్ఘటన

గోకవరం: విధి.. వారి పాలిట శాపమైంది. బతుకు తెరువు కోసం వచ్చిన వారిని వ్యాన్ రూపంలో మృత్యువు బలి తీసుకుంది. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం తిరుమలాయపాలెం గ్రామ శివారున సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. గోకవరం మండలం కామరాజుపేటకు చెందిన వ్యాన్ డ్రైవర్, క్లీనర్ కూడా ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సామర్లకోటకు చెందిన గుమలాపురం శ్రీను (31), మిరియాల నాగు (29) వీరభద్ర నాట్య ప్రదర్శన చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం గుమ్ములూరులో సోమవారం వీరు నాట్య ప్రదర్శన నిర్వహించారు. శ్రీను స్వగ్రామం తిరుమలాయపాలెం. ప్రదర్శన అనంతరం సామర్లకోట వెళ్లే క్రమంలో తల్లిదండ్రులను చూసేందుకు శ్రీను, నాగు బైక్‌పై తిరుమలాయపాలెం వెళ్లారు. అక్కడి నుంచి మళ్లీ సాల మీదుగా సామర్లకోటకు బయలుదేరారు. తిరుమలాయపాలెం గ్రామ శివారున కడేలమ్మతల్లి ఆలయం వద్ద పెద్ద మలుపు ఉంది. అక్కడ మళ్లిసాల వైపు నుంచి సర్వే కర్రల లోడుతో వస్తున్న వ్యాన్ వీరి బైక్‌ను ఢీకొట్టి, అదుపు తప్పి వారిపై బోల్తా పడింది. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి, సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న గోకవరం ఎస్సై యూవీ శివనాగబాబు తన సిబ్బందితో కలిసి హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యాన్ డ్రైవర్, క్లీనర్‌లను బయటకు తీసి, చికిత్స నిమిత్తం పోలీస్ జీపులో గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. బోల్తా పడిన వ్యాన్‌ను స్థానికులు జేసీబీ సహాయంతో తొలగించారు. దాని కింద చిక్కుకున్న శ్రీను, నాగును వెలికితీయగా.. అప్పటికే వారు మృతి చెందారు. మృతులిద్దరికీ వివాహాలు అయ్యాయి. ఇద్దరికీ ఇద్దరు చొప్పున పిల్లలున్నారు. మృతుల్లో శ్రీను కుల వృత్తితో పాటు ఆటో నడుపుకొంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.



బోల్తా పడిన సర్వే కర్రల లోడు వ్యాన్



వ్యాన్ కింద చిక్కుకున్న మృతదేహాలు




సంఘటన స్థలం వద్ద విషాదంలో మృతుల కుటుంబ సభ్యులు

ప్రమాద విషయం తెలుసుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించి, గోకవరం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రాణాలు కాపాడిన ప్రమాదం



బోల్తా పడిన వ్యాన్



క్షేమంగా బయటపడిన ఆవుదూడలు

- ఆవుదూడలను తరలిస్తున్న వ్యాన్ బోల్తా
- బయటపడి పరుగు తీసిన మూగజీవాలు

పిఠాపురం: ఎక్కడైనా ప్రమాదం జరిగితే ప్రాణాలు పోతుంటాయి. కానీ ఈ ప్రమాదం మాత్రం మూగజీవాల ప్రాణాలు నిలిపింది. ఈ ప్రమాదం జరగకపోతే మాత్రం వాటికి నూకలు చెల్లి ఉండేవే. 16వ నంబర్ జాతీయ రహదారిపై గొల్లప్రోలు మండలం వన్నెపూడి వద్ద సోమవారం మధ్యాహ్నం వేగంగా వెళ్తున్న ఒక కంటైనర్ వ్యాన్ అదుపు తప్పి, బోల్తా పడింది. గమనించిన స్థానికులు వ్యాన్‌లో ఉన్న వారిని కాపాడేందుకు పరుగులు తీశారు. తీరా చూస్తే ఆ వ్యాన్‌లో నుంచి పదుల సంఖ్యలో గోవులు తమ బంధాలు తెంచుకుని పరుగులు తీయడం చూసి స్థానికులతో పాటు దారిన పోయేవారు ఆశ్చర్యానికి గురయ్యారు. ఎవ్వరికీ అనుమానం రాకుండా ఈ కంటైనర్‌లో 33 ఆవుదూడలు, 4 దున్నపోతులను తాళ్లతో బంధించి, విశాఖ జిల్లా నామవరం నుంచి విజయవాడ కబేళాకు తరలిస్తున్నారు.



వ్యాన్‌లో ఊపిరి ఆడక మృతి చెందిన గోవులు

అనుకోకుండా ప్రమాదం జరగడంతో ఆ మూగజీవాలు స్వేచ్ఛావాయువులు పీల్చుకున్నాయి. విషయం తెలుసుకున్న గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆవు దూడలను గోశాలకు తరలించారు. వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదంలో వ్యాన్‌లోని రెండు ఆవులు మృతి చెందాయి.

# వైద్య శాఖ వివరాలు అడిగితే సభ్యులపై దాడి

- మండల కార్యాలయంలో డాక్టర్ అనుచరుల బీభత్సం
- పోలీసులకు జెడ్పీటీసీ ఫిర్యాదు

రంగంపేట: మండల సమావేశంలో వైద్య శాఖ వివరాలు అడిగితే పీహెచ్‌సీ డాక్టర్ లావణ్య కుటుంబ సభ్యులు, అనుచరులు తమపై దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారని జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు ఆరోపించారు. సోమవారం సాయంత్రం వారు మీడియాతో మాట్లాడారు. వారేమన్నారంటే.. సోమవారం మండల పరిషత్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైద్య శాఖకు సంబంధించిన వివరాలు తెలపాలని రాంబాబు కోరారు. తనకు ఓపీ ఉందని లావణ్య చెప్పడంతో వివరాలు తెలిపి వెళ్లాలన్నారు. దీంతో ఆమె బయటకు వెళ్లి తండ్రి వెంకట్రావుకు, సోదరుడు కిరణ్‌లకు ఫోన్ చేశారు. వారు మరో 40 మందితో రాజమహేంద్రవరం నుంచి మండల కార్యాలయానికి చేరుకున్నారు. ఎంపీపీ రూములో కూర్చున్న రాంబాబు, మండల విప్ సుంకర అప్పారావు, ప్రజాప్రతినిధులపై దుర్భాషలాడుతూ దాడి చేశారు. అప్పారావు చొక్కా చించివేశారు. దీనిపై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధ్యతగల విధుల్లో ఉండి ప్రజాప్రతినిధులపై



ఎంపీపీ కార్యాలయంలోకి దూసుకొస్తున్న డాక్టర్ లావణ్య వర్గీయులు

దాడి చేయడం సమంజసం కాదని రాంబాబు, ఇజ్రాయేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యారోగ్య శాఖ అధిరులు స్పందించి దాడి, దౌర్జన్యాలకు కారణమైన డాక్టర్ లావణ్యను, పీహెచ్ఎస్ గంగాభవానీని విధుల నుంచి సస్పెండ్ చేయాలని, దాడిలో పాల్గొన్న వారందరిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని కోరారు.

**నాపై గట్టిగా కేకలు వేశారు : డాక్టర్ లావణ్య**

ఓపీ ఎక్కువగా ఉందనే సమాచారంతో ఆస్పత్రి వెళ్లేందుకు తాను ఎంపీడీఓ అనుమతి కోరానని డాక్టర్ లావణ్య చెప్పారు. ఆ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు తనపై గట్టిగా కేకలు వేశారన్నారు. ఇదే విషయాన్ని తన తండ్రికి, సోదరులకు ఫోన్ చేసి చెప్పానన్నారు. దీంతో వారందరూ వచ్చి రాంబాబును అడిగారన్నారు. ఈ సందర్భంలో ఇరువైపులా మాటామాటా అనుకున్నారని లావణ్య 'సాక్షి'తో చెప్పారు.

# చుక్కలున్నా.. చక్కనివే..

- 'స్టార్' గుర్తున్న కరెన్సీ మంచిదే
- నకిలీదంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం




పైన సాధారణ నోటు.. కింద స్టార్ నోటు



కృష్ణ కామేశ్వర్ సేకరించిన పలు స్టార్ నోట్లు

అమలాపురం టౌన్: కొన్ని కరెన్సీ నోట్లపై నోటు క్రమ సంఖ్యతో పాటు స్టార్ గుర్తు ఉంటుంది. కొన్ని నోట్లపై మాత్రమే ఈ స్టార్ గుర్తు ఎందుకు ఉంటుందనే అంశంపై ప్రస్తుత పరిస్థితుల్లో అవగాహన పెంచుకోవాల్సిన అవసరముంది. ఎందుకంటే ఇటీవల కాలంలో స్టార్ ఉన్న నోట్లు నకిలీవి అంటూ కొంత మంది సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి స్టార్ గుర్తుతో ఉన్న నోట్లు అనేకం సేకరించిన అమలాపురానికి చెందిన కరెన్సీ నోట్ల సేకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ నోట్లపై ఈ స్టార్‌ను రిజర్వు బ్యాంకు ఎందుకు ముద్రిస్తుందో, అందుకు అనుసరించే సాంకేతిక, శాస్త్రీయ అంశాలేమిటో వివరించారు.

**స్టార్ నోట్లు ఇలా..**

దేశంలోని ప్రతి కరెన్సీ నోటుపై మొదటి రెండు అంకెల తర్వాత ఒక ఆంగ్ల అక్షరం (ఒక రూపాయి నుంచి రూ.20 వరకూ), లేదా ఒక అంకె తర్వాత రెండు ఆంగ్ల అక్షరాలు (రూ.50 విలువ పైబడిన నోట్లన్నిటి మీద) ఉంటాయి. దీనిని ప్రిఫిక్స్ అంటారు. ఇలా ముద్రించిన రెండంకెలు, ఆంగ్ల అక్షరం తర్వాత కొంత ఖాళీ ఉండి.. తర్వాత ఆరంకెల క్రమ సంఖ్య ఉంటుంది. కొన్ని నోట్ల మీద ఇలా ఖాళీ ఉన్న భాగంలో స్టార్ గుర్తు ఉంటుంది. వీటిని స్టార్ నోట్లు లేదా రీ ప్లేస్‌మెంట్ నోట్లు అని అంటారు.

**పాడైన నోట్ల పైనే స్టార్లు**

సాధారణంగా చిరిగిపోయిన లేదా బాగా పాడైపోయిన నోట్లను బ్యాంకుల్లో జమ చేస్తాం. అవన్నీ రిజర్వు బ్యాంక్‌కు చేరతాయి. వాటిని ఒకచోట భద్రపరచి మళ్లీ అవే నంబర్లతో నోట్లు విడుదల చేస్తారు. పాత నోట్ల మీద అప్పటి గవర్నర్ సంతకం ఉంటుంది కాబట్టి వాటి మీద కొత్త గవర్నర్ సంతకం ముద్రించేందుకు వీలుగా ఈ స్టార్‌ను ముద్రిస్తారు. పాత లేదా పాడైపోయిన నోట్ల రీ ప్లేస్‌మెంట్ కోసం ఓ గుర్తుగా స్టార్‌ను ముద్రిస్తారు. ఇంత వరకూ ఎన్ని స్టార్ నోట్లు ముద్రించామన్నది రిజర్వు బ్యాంక్ వద్ద ఉంటుంది. భారతీయ రిజర్వు బ్యాంక్ 2006 ఆగస్టు 31న ఈ స్టార్ నోట్ల విడుదల గురించి ప్రత్యేక ప్రకటన చేసింది. ఈ స్టార్ నోట్లు కలిగి ఉన్న బండిల్స్ మీద కూడా ప్రత్యేక గుర్తు ముద్రించి ఉంటుందని కృష్ణకామేశ్వర్ తెలిపారు. ఈ స్టార్ నోట్లు కూడా సాధారణ నోట్ల మాదిరిగానే చలామణీ అవుతాయని స్పష్టం చేశారు.

### డివైడర్‌ను ఢీకొని మోటార్ సైక్లిస్ట్ మృతి

కిర్లంపూడి: అదుపు తప్పిన బైక్ డివైడర్‌ను ఢీకొట్టడంతో మోటార్ సైక్లిస్ట్ మృతి చెందాడు. కిర్లంపూడి ఎస్సై బి.ఉమామహేశ్వరరావు కథనం ప్రకారం.. కిర్లంపూడి మండలం గోనేడకు చెందిన కేసారపు సత్తిబాబు (37) వ్యక్తిగత పనులపై సోమవారం మోటార్ సైకిల్‌పై కత్తిపూడి వెళ్లి, తిరిగి వస్తున్నాడు. కృష్ణవరం టోల్ గేట్ దాటిన తరువాత.. జాతీయ రహదారి డివైడర్‌ను ప్రమాదవశాత్తూ ఢీకొట్టి, తీవ్రంగా గాయపడ్డాడు. ప్రత్తిపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి భార్య కేసారపు అమరావతి ఫిర్యాదు మేరకు ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.